నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 21 మే 2024 | NIZAMABAD



టెలీకాన్ఫరెన్స్‌లో ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

# 24లోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి

## ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్

కామారెడ్డి, మే 20: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఈ నెల 24లోగా పూర్తి చేయాలని కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాల ప్రత్యేకాధికారి డాక్టర్ శరత్ అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ జితేశ్ వీ పాటిల్,అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ ఇతర అధికారులతో సోమవారం ఏర్పాటు చేసిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతంగా చేస్తున్నారని, రైస్‌మిల్లర్లు కూడా సహకరిస్తున్నారని ప్రశంసిస్తూ ఇదే స్ఫూర్తితో వచ్చే శుక్రవారంలోగా కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. కొనుగోళ్లు ముగిసిన 180కేంద్రాల సిబ్బంది, హమాలీ, తూకం యంత్రాలను వడ్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలకు తరలించి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. రోజుకు 10వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం తరలించేందుకు కొనుగోలు కేంద్రాలు పగలు,రాత్రి పనిచేసేలా చూడాలని సూచించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో 350కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 97శాతం ట్యాబ్ ఎంట్రీ పూర్తిచేసి 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి డబ్బులు చెల్లించామని వివరించారు. 230 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామని, మిగిలిన 120 కేంద్రాల్లో శుక్రవారం నాటికి పూర్తిగా కొనుగోలు చేసేలా అధికారులతో మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, ఇన్‌చార్జి జిల్లా మేనేజర్ నిత్యానందం, వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి, సహకార శాఖ అధికారులు ప్రశాంత్ రెడ్డి, భూమయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఐకేపీ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భార్య బాదుడు నుంచి రక్షించండి

- అర్ధనగ్నంగా ఠాణాకు వచ్చిన బాధితుడు
- బాన్సువాడలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

బాన్సువాడ, మే 20: భార్య తరచూ కొడుతున్నదని, తనకు న్యాయం చేయాలని ఓ వ్యక్తి అర్ధనగ్నంగా వచ్చి పోలీసులను ఆశ్రయించాడు. కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణ సీఐ కృష్ణ కథనం ప్రకారం.. బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి (50) చెడ్డిపై ఆదివారం పోలీసుస్టేషన్‌కు వచ్చాడు. అర్ధనగ్నంగా ఉన్న ఆయనను పోలీసులు చూసి అవాక్కయ్యారు. తన భార్య నిత్యం కొడుతున్నదని, తనకు న్యా యం చేయాలని పోలీసులను ఆశ్రయించాడు. అయితే, ముందుగా దవాఖానకు వెళ్లి చూయించుకుని రావాలని పోలీసులు సూచించారు. కాసేపటికే ఆయన కూతురు వచ్చి అతడ్ని ఇంటికి తీసుకెళ్లారు.

తమ దవాఖానలో అన్ని రకాల అత్యాధునిక సౌకర్యాలు, పరికరాలు ఉన్నాయంటూ ప్రచారాలు చేస్తున్న ప్రైవేటు దవాఖానలు.. క్షేత్రస్థాయిలో చూస్తే అవేం కనిపించవనే ఆరోపణలు ఉన్నాయి. అర్హతలు లేకున్నా మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలంటూ బోర్డులు ఏర్పాటు చేస్తూ వైద్యం కోసం వస్తున్న రోగుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. సరైన వైద్యం అందక రోగుల ప్రాణాలు పోతే.. సెటిల్‌మెంట్ పేరిట డబ్బులు అందించి చేతులు దులుపుకుంటున్నారు. ఇలాంటి సమయంలో సానుభూతి చూపాల్సిన వైద్య సంఘాల నాయకులు పలువురు దవాఖాన యాజమాన్యాలకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ప్రైవేటు దవాఖానలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.






## ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం..



మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ దవాఖానలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అందుకోసం ఆరు బృందాలను ఏర్పాటు చేశాం. ప్రతి దవాఖానలో సౌకర్యాలు, అర్హతలపై బృందం నివేదిక తయారు చేస్తున్నది. డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రతి దవాఖానపై దృష్టి సారించాం. బాధితులు ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. అధిక డబ్బులు వసూలు చేసే దవాఖానలను సైతం తనిఖీ చేస్తాం.

**- తుకారాం రాథోడ్, డీఎంహెచ్‌వో, నిజామాబాద్**

పేరుకే సూపర్, మల్టీ స్పెషాలిటీ

వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు

## ప్రాణం పోతే.. పైసలతో సెటిల్‌మెంట్..

జిల్లా కేంద్రంలో రెండు నెలల వ్యవధిలో మూడు, నాలుగు ఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక ప్రైవేటు దవాఖానలో 10 సంవత్సరాల పిల్లవాడు చేరగా కాలం చెల్లిన ఇంజెక్షన్ వేయడంతో ఆ బాలుడు మరణించాడు. మరోచోట క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారం అపహరణ చేశారు. మరో దవాఖానలో అబార్షన్ చేయబోయి.. మహిళను పొట్టన పెట్టుకున్నారు. మరికొన్ని దవాఖానల్లో బయటికి రాని సంఘటనలు చాలా ఉన్నాయి. అర్హత, అనుభవం లేని కొంత మంది చేస్తున్న వైద్యంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రైవేటు యాజమాన్యాలు, దవాఖానలు రోగి ప్రాణాలకు ఖరీదు కడుతున్నాయి. డబ్బులు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా స్థాయి అధికారులెవరూ చర్యలు తీసుకోక పోవడం గమనార్హం.

# ప్రైవేటు దగాఖానాలు

నిజామాబాద్ జిల్లాలోని ప్రైవేటు దవాఖానలపై వైద్యశాఖ అధికారుల నిఘా కరువైంది. పుట్టగొడుగుల్లా ప్రైవేటు దవాఖానలు వెలుస్తున్నాయి. అర్హత లేకున్నా మల్టీ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీల పేరిట దవాఖాన బోర్డులు దర్శనమిస్తున్నాయి. కోట్ల రూపాయలతో దవాఖానలు కట్టి, వాటిని ప్రజల నుంచే వసూలు చేయాలనే ఉద్దేశంతో కొంతమంది వైద్యులు, యాజమాన్యాలు దవాఖానలను ప్రారంభిస్తున్నాయి. దీంతో చిన్న రోగానికి చికిత్స కోసం వెళ్తే దవాఖానలో అడ్మిట్ చేసుకొని లక్షలు దండుకుంటున్నారు. ఎలాగోలా ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు రోగులు నిరుపేదలైనా ఆస్తులు అమ్ముకొని దవాఖానల బిల్లులు కడుతున్నారు. ఆరోగ్యం మాట అటుంచితే దవాఖాన బిల్లులను చూస్తేనే గుండె గుబేల్‌మంటున్నది. అందినకాడికి దోచుకోవడమే లక్ష్యంగా ఇష్టారీతిన గల్లీగల్లీకి ఓ దవాఖాన పుట్టుకొస్తున్నది. నిబంధనలకు పాతర వేస్తూ రోగంతో సంబంధం లేకుండా ప్రతి దానికి పరీక్షలు, స్కానింగ్‌లు చేస్తూ రోగుల నుంచి వేలాది రూపాయలు గుంజుతున్నారు. దీంతో ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలకు కాసుల పంట పండుతున్నది. చిన్న సమస్యతో ప్రైవేటు దవాఖానకు వెళ్తే తక్కువలో తక్కువ వేలల్లో బిల్లులు వేస్తున్నారు. రోగుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ల్యాబ్‌లు, మెడికల్ షాపులు ఇలా ప్రతి ఒక్కటీ ప్రైవేటు దవాఖానల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి.

- లక్షలు పెడుతున్నా ప్రాణాలకు భరోసా కరువు
- అరకొర వసతులతో దవాఖానల ఏర్పాటు
- వైద్యుల అర్హతలపై కొరవడిన నిఘా
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు దవాఖానలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

*పేరుగొప్ప ఊరుదిబ్బ అన్న చందంగా మారాయి ప్రైవేటు దవాఖానలు. కార్పొరేట్ లుక్‌తో ఏర్పాటవుతున్న దవాఖానాలు.. వసతులు, సౌకర్యాలు, అనుభవలేమి సిబ్బందితో వైద్యం చేయిస్తూ అమాయకుల ప్రాణాలను బలి గొంటున్నాయి. మెరుగైన వైద్యం పేరిట లక్షలు వసూలు చేస్తూ చివరికి మృతదేహాలను అప్పగిస్తున్నారు. తమ నిర్లక్ష్యంతోనే రోగి మృతి చెందినట్లు తేలితే ఆ ప్రాణానికి వెలకట్టి.. మృతుడి కుటుంబీకులకు డబ్బులు పారేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. నెల రోజులుగా జిల్లా వ్యాప్తంగా పలు ప్రైవేటు దవాఖానల్లో రోగులు ప్రాణాలు విడుస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది.*

*- ఖలీల్‌వాడి, మే 20*



- జిల్లా కేంద్రంలోని ఖిల్లా రోడ్‌లో ఉన్న ఓ దవాఖాన వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ తన గర్భాశయాన్ని కోల్పోయింది.
- గుండెనొప్పితో జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలోని ప్రైవేటు దవాఖానలో చేరిన ఓ యువకుడికి శస్త్రచికిత్స చేయకుండా వారంపాటు నిర్లక్ష్యం చేయడంతో ఆ యువకుడు మరణించాడు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించినా రోగి కుటుంబసభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసిన దవాఖాన.. చివరకు మృతదేహాన్ని అప్పగించింది.
- ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ఉండే ఓ దవాఖానలో చేరిన గర్భిణి.. డెలివరీ అనంతరం మృతి చెందింది.



నిజాంసాగర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో ధర్నా

# రోడ్డెక్కిన రైతన్న

బీబీపేట్/ నిజాంసాగర్, మే 20: ధాన్యం కొనుగోళ్లు సరిగా నిర్వహించడం లేదంటూ బీబీపేట మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా వద్ద మల్కాపూర్ గ్రామ రైతులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దీంతో అకాల వర్షంతో వడ్లు తడిసి మొలకలు వస్తున్నాయని పేర్కొన్నారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. లారీల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారంలోపు ధాన్యా న్ని తరలిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు.

నిజాంసాగర్ మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద రైతులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం, బస్తాలను రైస్‌మిల్లులకు తరలించడంలో సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాస్తారోకోలో నిజాంసాగర్, మాగి, గోర్గల్, సుల్తాన్‌నగర్ తదితర గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కొనుగోళ్లు త్వరగా పూర్తిచేస్తామని, ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని అచ్చంపేట సొసైటీ కార్యదర్శి హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.



బీబీపేటలో రైతులతో మాట్లాడుతున్న డీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ ఇంద్రసేనారెడ్డి

# ముంచుకొస్తున్న ముప్పు..

- బోధన్ పట్టణానికి తాగునీటి కొరత ప్రమాదం
- బెల్లాల్ చెరువులో తగ్గిపోతున్న నీటిమట్టం
- త్వరలోనే డెడ్ స్టోరేజీకి చేరుకునే అవకాశం
- తాగునీటిపై పట్టణవాసుల్లో ఆందోళన



గుర్రపుడెక్కతో నిండిపోయిన బెల్లాల్ చెరువు

బోధన్, మే 20: బోధన్ పట్టణానికి తాగునీటి కొరత ముప్పు ముంచుకువస్తున్నది. పట్టణానికి ఆనుకొని ఉన్న 'బెల్లాల్' చెరువులో నీటిమట్టం గణనీయంగా పడిపోతుండడమే ఇందుకు కారణం. సాగునీటితోపాటు తాగునీటిని అందించే ఈ చెరువు బోధన్ డివిజన్‌లోనే అతి పెద్ద చెరువు. 1500 ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందించడంతోపాటు బోధన్ పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీటి సరఫరాకు ఏకైక వనరుగా ఈ చెరువు ఉన్నది. ఏడేండ్లుగా ఈ చెరువులో ఏనాడూ ఇలా నీటిమట్టం తగ్గలేదు. వేసవిలో సైతం బెల్లాల్ చెరువు నీటితో కళకళలాడుతూ కనిపించేది. ప్రణాళిక కొరవడడం, సాగు, తాగునీరు అవసరాలను అంచనావేసి అందుకు అనుగుణంగా చెరువును నిజాంసాగర్ నీటితో నింపే విషయంలో తగిన చర్యలు సకాలంలో చేపట్టని ఫలితంగా ఈ దుస్థితి ఏర్పడింది. అసలే చెరువు ఎండిపోతుండగా, చెరువులో ఉన్న నీటిని కూడా గుర్రపు డెక్క పూర్తిగా కప్పేసింది. గుర్రపు డెక్క చెరువు అంతటా పరుచుకోవడంతో నీటి వృథా పెరుగుతుండడంతోపాటు నీరు కలుషితం అవుతున్నది. ఈ పరిస్థితుల్లో తొలకరిలో కురిసే వర్షాలతో చెరువులోని నీరు మరింతగా కలుషితమై తాగేందుకు పనికిరాని పరిస్థితి ఏర్పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. అప్పుడు పట్టణంలోని మురికినీటితోపాటు కలుషిత జలాలను శుద్ధిచేయడం ఒక పెద్ద సమస్యగా బోధన్ మున్సిపాలిటీ ఎదుర్కోవాల్సి ఉంటుంది.

### 189 ఎంసీఎఫ్‌టీల నీరు మాత్రమే..

యాసంగి పంట కోతలు ముగియడంతో ఇప్పుడు బెల్లాల్ చెరువు నుంచి సాగునీటిని అందించాల్సిన అవసరం లేదు. కేవలం తాగునీటిని ఈ చెరువు నుంచి సరఫరా చేస్తే సరిపోతుంది. ఇప్పటి వరకు ఎండాకాలంలో తాగునీటికి పట్టణంలో ఇబ్బందులు ఏర్పడలేదు. చెరువులో పుష్కలంగా నీరు ఉండడంతో మున్సిపల్ అధికారులు ఎన్నడూ ఆందోళనపడిన సందర్భాలు లేవు. అయితే గత కొన్ని రోజులుగా బెల్లాల్ చెరువులో నీటిమట్టం గణనీయంగా పడిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ 12 అడుగులు కాగా, ఇప్పుడు నీటిమట్టం 8.5 అడుగులకు పడిపోయింది. ఈ చెరువు పూర్తి నిల్వ సామర్థ్యం 346 ఎంసీఎఫ్‌టీలు కాగా, ప్రస్తుతం కేవలం 189 ఎంసీఎఫ్‌టీల నీరు మాత్రమే ఉన్నది. ఈ నీరు వచ్చే జూన్ 15 వరకు సరిపోతుందని మున్సిపల్ అధికారులు అంటున్నప్పటికీ, చెరువు గర్భంలో పెద్ద ఎత్తున వ్యర్థ పదార్థాలతోపాటు గుర్రపుడెక్క, బురద ఉండడంతో ఈ నెలాఖరుకు చెరువులో నీరు డెడ్ స్టోరేజీకి చేరుకుంటుందని నిపుణులు అంటున్నారు. చెరువు క్రమంగా ఎండిపోతుండడంతో మున్సిపల్ అధికారులు శుక్రవారం బెల్లాల్ చెరువును సందర్శించారు. చెరువు పరిస్థితిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని నిర్ణయించారు. సుమారు లక్షకు పైగా ఉన్న పట్టణ జనాభాకు తాగునీరు అందించేందుకు ఈ చెరువే ఏకైక వనరు. ఇకనైనా, అధికారులు రానున్న రోజుల్లో పట్టణంలో ఏర్పడే తాగునీటి సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాల్సిన అవసరమున్నది.

## మెట్ల బావిని బాగుచేయరూ!

*చారిత్రక కట్టడాల్లో భాగమైన మెట్ల బావులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఏండ్ల నాటి ఈ బావుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి కనుమరుగవుతున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పెద్దరాంమందిర్‌లో నాలుగైదు శతాబ్దాల నాటి మెట్ల బావి ఉన్నది. పునరుద్ధరణ పనులు చేపట్టి మెట్ల బావికి పూర్వవైభవం తీసుకొస్తే పర్యాటక ప్రాంతంగా మారుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మెట్లబావిని బాగుచేయాలని కోరుతున్నారు.*

*– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్*







